

అనుమానాస్పద వ్యక్తులకు..

అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన చిలుకమ్మతండాలో చోటు చేసుకుంది.

- 8లో▸



దక్షిణ మధ్య రైల్వే ప్రజలందరిది

దక్షిణ మధ్య రైల్వే ప్రజలందరిదని, రైల్వే ఆస్తులను ఎవరూ ధ్వంసం చేయొద్దని దక్షిణ మధ్య రైల్వే కాజీపేట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
37.5°/13.5°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికమవుతుంది. రాత్రి చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

యోగా, పర్యావరణంపై పాదయాత్ర



భూపాలపల్లి అర్బన్: కరోనా వైరస్‌తో ప్రపంచం మొత్తం అతలాకుతలమైందని, అప్రమత్తతతో ఉండడంతో మనమంతా బయటపడ్డామని యోగ మాస్టర్ కృష్ణనాయక్ అన్నారు. యోగ, పర్యావరణంపై దేశంలోని 28రాష్ట్రాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పాదయాత్ర ప్రారంభించినట్లు కృష్ణ తెలిపారు. ఆయన చేపట్టిన పాదయాత్ర శనివారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మాస్టర్ కృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. తనది మైసూర్ ప్రాంతమని పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ నాలుగు నెలల క్రితం పాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల్లో పాదయాత్ర నిర్వహించినట్లు చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత, యోగా చేయడంతో రోగాలు దరిచేరవన్నారు. పాదయాత్ర 28రాష్ట్రాల్లో పూర్తిచేసుకుని తిరిగి మైసూర్‌లో ముగుస్తుందన్నారు.

10వ రోజుకు చేరిన జర్నలిస్టుల దీక్షలు



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో జర్నలిస్టులు చేపడుతున్న రిలే నిరహార దీక్షలు శనివారం నాటికి 10వ రోజుకు చేరుకున్నాయి. కలెక్టర్ ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలని జర్నలిస్టులు చేపడుతున్న దీక్షలకు జిల్లాల్లోని వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలుపుతున్నారు. 10రోజులుగా ఆందోళనలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని జర్నలిస్టులు అన్నారు. ఎమ్మెల్యే స్పందించి న్యాయంచేయాలని కోరారు. లేనిపక్షంలో నిరవధిక నిరాహార దీక్ష చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

14న అభినందన సభ

కాటారం: కులాంతర వివాహం చేసుకున్న ఆదర్శ దంపతులకు ఈ నెల 14న కాటారం మండలకేంద్రంలో అభినందన సభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి వ్యక్తిత్వాన్ని సమాజానికి చాటి చెప్పాలనే ఉద్దేశంతో కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు చెప్పారు. కుల నిర్మూలనే ధ్యేయంగా కేవీపీఎస్ పనిచేస్తుందని అన్నారు. కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు ప్రభుత్వం ద్వారా రూ.2.50 లక్షలు ప్రోత్సాహకం అందేలా కృషిచేసిన ఘనత కేవీపీఎస్‌ది అన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నెరవేర్చుకోవాలి

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులు లక్ష్యాలను నిర్ధారించుకొని వాటిని నేరవేర్చుకోవాలని జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారిణి సునీత అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం పదో తరగతి విద్యార్థులకు 'ప్రేరణ తరగతులు' ఏఎస్‌డబ్ల్యూఓ అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టులలో విషయ నైపుణ్యలను ఉపాధ్యాయులతో వివరించి, వ్యక్తిగత వికాసంపై బోధించారు. సునీత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రేరణ తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారులు శ్రీనివాస్, ప్రతాప్, రాజయ్య, జ్యోతికుమార్, రాజ్‌కుమార్, భవాని పాల్గొన్నారు.


వృత్తిని మరింత పటిష్ట పర్చాలి



ములుగు రూరల్: మత్స్యకారుల వృత్తిని మరింత పటిష్టపర్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బొల్లు దేవేందర్, ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిటమట రఘు అన్నారు. జిల్లాకేంద్రంలో మత్స్యకారుల సంఘం సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. మత్స్యపారిశ్రామిక సంఘాలు ముదిరాజులకు, గంగపుత్రులకు, బెస్త వారికి మాత్రమే ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో మత్స్యకారుల వృత్తిని.. జీవన విధానాన్ని దెబ్బతీసే విధంగా భట్టి విక్రమార్క మాట్లాడటం సరికాదన్నారు. ఈ సమావేశంలో వెంకటమల్లయ్య, కుమార్, రఘు, వెంకటస్వామి, పెద్ది నర్సింహులు, కంబాల రవి, రఘు, సాంబయ్య, సురేష్, సాంబయ్య పాల్గొన్నారు.

జడలు విప్పుతున్న మూఢత్వం

టెక్నాలజీ ప్రపంచంలోనూ మంత్రాల భయం



- మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదిలో గత శుక్రవారం క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు ఉండడం కలకలంరేపింది. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు స్కూల్‌లోని ఎనిమిదో తరగతి గది తలుపులను తెరిచి అందులో ఒక బొమ్మను పెట్టి పసుపు, కుంకుమను బొమ్మపై పోశారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గది తలుపులు తీయగా.. బొమ్మ కనిపించడంతో భయంతో పరుగులు తీశారు. సీరోలు పోలీసులు బొమ్మను తొలగించి, నీటితో శుభ్రం చేయించారు.
- హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లికి చెందిన రాజయ్య ఇంటి ముందు శుక్రవారం ఉదయం కోడి తల, నల్ల, తెల్లగుడ్డ, పసుపు, కుంకుమలు ప్రత్యక్షమయ్యాయి. వీటిని చూసిన రాజయ్య భయాందోళనకు గురయ్యాడు.
- పాముకాటుకు గురైన కూతురికి నాటు వైద్యం చేయించాలన్న తండ్రి మూఢ నమ్మకంతో ఆ పాప ప్రాణం పోయింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం భట్టుతండాలో గత బుధవారం పాముకాటుకు గురైన చిన్నారి మన్విత తను తండ్రి ఆస్పత్రికి కాకుండా నాటు వైద్యానికి తీసుకెళ్లాడు. అప్పటికే పాప ప్రాణం పోయింది. అదే నేరుగా ఆస్పత్రికి తీసుకెళ్తే యాంటీవీనమ్ ఇంజక్షన్లు ఇచ్చేవారు. దీంతో పాప బతికేది.
- జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి గ్రామంలో రెండు నెలల క్రితం నాలుగు ప్రధాన కూడళ్లలో కాళికామాతను పోలిన బొమ్మ పెట్టి పసుపు కుంకుమ, నిమ్మకాయలు తదితర పూజాసామగ్రితో అర్ధరాత్రి సమయంలో పూజలు చేశారు.
- గత అక్టోబర్‌లో వరంగల్ ఉర్సు కరీమాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీప నిర్జన ప్రదేశంలో ఓ ఆలయ పూజారి ఇద్దరి వ్యక్తులతో కలిసి క్షుద్ర పూజలు చేస్తుండగా స్థానికులు పట్టుకొని మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు.

- అమాయకుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు
- బడులు, కూడళ్లలో చేతబడుల ఆనవాళ్లు
- మంత్రాలు, తంత్రాలు లేవంటున్న జన విజ్ఞాన వేదిక
- మూఢ నమ్మకాల నిరోధక చట్టం తేవాలంటున్న విద్యావేత్తలు

(వర్థెల్లి లింగయ్య)

ప్రతీ పనికి రోబోను వినియోగిస్తున్న కాలమిది. టెక్నాలజీలో ప్రపంచం ఓ కుగ్రామంగా మారింది. మనిషి మేధస్సు శాస్త్ర సాంకేతిక అంశాల రూపకల్పనలో వేగంగా పని చేస్తోంది. అయినా.. నేటికీ సమాజంలో మూఢనమ్మకాలు పెరుగుతున్నాయి. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా చేతబడి, బాణమతి, చిల్లంగి, దయ్యాలు.. భూతాలు అంటూ జనం నమ్ముతున్నారు. ఒకప్పుడు నిరక్షరాస్యత కారణంగా వీటిని నమ్ముతున్నారనుకున్నాం. కానీ.. అక్షరాస్యులు సైతం వీటికి లోనవుతుండడం ఆందోళన కలిగించే అంశంగా చెప్పొచ్చు. గ్రామాల కూడళ్లలో, నిశీధి ప్రాంతాల్లో జరిగే ఈ పూజలు చివరికి పాఠశాలలకు చేరుకున్నాయి.

నమ్మకం పెరిగి మూఢత్వంగా మారుతోందా?

ఫలానా అంశం మీద నమ్మకం అనేది అందరిలోనూ ఉంటుంది. కొందరిలో ఆ నమ్మకం గీత దాటి మూఢత్వంగా మారుతోందని విద్యావేత్తలు చెబుతున్నారు. సమాజంలో సైన్స్‌పై అవగాహన లేకపోవడం ఓకారణమైతే.. సులభంగా సమస్యల పరిష్కారం, ఈజీగా సంపాదించాలన్న ఆశ ఉన్నవారు ఇలాంటి మూఢత్వ పూజలకు లొంగుతున్నారని అంటున్నారు. ప్రసార మాధ్యమాలు, సినిమాలు కూడా మూఢత్వం పెరగడానికి కారణమని జన విజ్ఞాన వేదిక సభ్యులు చెబుతున్నారు. ఈ నమ్మకాలతో ఒక్కోసారి ప్రాణాలు పోతున్నాయి.


ఆ రెండ్రోజులే ఎందుకు?

మంత్రగాళ్లు అని చెప్పుకునేవారు శుక్ర, ఆదివారం తెల్లవారు జామున.. ఆ రెండ్రోజులు సెంటిమెంట్‌గా చెప్పి అమాయక ప్రజలపై మూఢ నమ్మకాలను మెదళ్లలోకి ఎక్కిస్తున్నారు. గురువారం పొద్దు, ఆదివారం పొద్దు కూసిందని నమ్మబలుకుతుంటారు. ఈ రెండు రోజుల కాలమానంలోనే దయ్యాలు భూతాలను పారదోలే శక్తి తమకు ఉంటుందని పేర్కొంటున్నారు. అందుకే సాధారణంగా ఈ రెండ్రోజుల్లోనే మనకు కూడళ్లలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కనిపిస్తుంటాయి.

మహిళలే తొందరగా నమ్మేది..

బాణమతి, చేతబడి పూజలు చేస్తామని చెప్పే వారి మాటలను మహిళలు తొందరగా నమ్ముతుంటారు. మహిళల్లో ఉండే మానసిక బలహీనతను ఆసరాగా చేసుకుంటున్నారు. శాస్త్రీయభావన, ప్రశ్నించేతత్వం పెరిగితే ఇలాంటివాటికి దూరంగా ఉండొచ్చని మహిళా సామాజికవేత్తలు చెబుతున్నారు.

జిల్లాల వారీగా అక్షరాస్యత శాతం (2011 జనాభా లెక్కల ప్రకారం)



ఇలా చేస్తే మంచిది..

- గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను కల్పించాలి. మానసిక ఇబ్బంది పడేవారు (బాణమతి) రోగులను ఆస్పత్రుల్లో చేర్చుకుని సత్వర వైద్య సదుపాయాన్ని అందించాలి. బాణమతిపై సరైన అవగాహన కల్పించడం, మానసిక వైద్య నిపుణులను, మానసిక శాస్త్రవేత్తలను, వైద్య, సామాజిక కార్యకర్తలను నియమించాలి.
- పిల్లల్లో సమాచార ప్రసార సంబంధాలను మెరుగుపర్చాలి. విజ్ఞాన, వైజ్ఞానిక యాత్రలు, మాయాజాల ప్రదర్శనలను వృద్ధిపర్చాలి. సైన్స్ ప్రాధాన్యాన్ని తెలపాలి.
- స్వచ్ఛంద సంస్థలకు ప్రోత్సాహమివ్వాలి. మీడియా (పత్రిక, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలు) పాత్ర ఇంకా పెరగాలి.
- భూత పూజలకు వ్యతిరేకమైన పాఠ్యాంశాలను పాఠశాల విద్యాప్రణాళికలో చేర్చాలి.
- చేతబడిలాంటి పూజలు చేసే వారిని శిక్షించేలా కఠిన చట్టాలు చేయాలి.

చాపకింద నీరులా..



సమాజంలో మూఢత్వం చాపకింద నీరులా విస్తరిస్తోంది. నోటిమాటతోనే పరిధి దాటుతోంది. దీన్ని అందరం అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. జన విజ్ఞాన వేదిక తరఫున సైంటిఫిక్ ఆలోచన పెంచేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. శాస్త్రవేత్తల జయంతి సందర్భంగా పిల్లలకు వారు చేసిన ప్రయోగాలు.. మానవాళికి ఎంత ప్రయోజనం చేకూరాయి.. ఇప్పుడు ఎటువంటి సత్ఫలితాలు అనుభవిస్తున్నామో వివరిస్తున్నాం.

- పరికిపండ్ల వేణు, జేవీవీ ప్రధాన కార్యదర్శి, హనుమకొండ

మూఢ నమ్మకాల నిరోధక చట్టం తేవాలి



ఈజీగా సంపాదించాలన్న ఆలోచన రావొద్దు. అది వ్యక్తిత్వ వికాసానికి అడ్డంకి. తాంత్రిక పూజలు నివారించాలంటే మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలి. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చాయి. మన దగ్గర కేసు పెట్టడానికి అవకాశం లేదు.

- దురిశెట్టి కాశీనాథ్, నిట్ ప్రొఫెసర్, జేవీవీ హనుమకొండ అధ్యక్షుడు

సైకోఫ్రోనియా మానసిక రుగ్మతే కారణం..



సైకోఫ్రోనియా అనే మానసిక రుగ్మతతో బాధపడే వారిలో మూఢనమ్మకాలు ఉంటాయి. ముఖ్యంగా వాళ్లకు ఇలాంటి జబ్బు రావడానికి కారణం భయం. వారికి కూడా మంత్రాలు వచ్చినట్లు, తమ మీద తెలియని వాళ్లు చేసినట్లు నమ్ముతారు. వీటిని డిలేషన్స్ అంటారు. డోపమైన్ అనే రసాయనం మెదడులో ఎక్కువ విడుదల కావడం వల్ల ఇది వస్తుంది. ఇలాంటివారు మానసిక వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి. - **డాక్టర్ మానస, మానసిక వైద్యనిపుణురాలు**

రామప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జడ్జి లలిత శివజ్యోతి, కుటుంబసభ్యులు



రామప్పను సందర్శించిన ప్రముఖులు

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని శనివారం జిల్లా జడ్జి లలిత శివజ్యోతి కుటుంబసమేతంగా సందర్శించారు. జనగామ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి వేర్వేరుగా పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి హరీశ్‌శర్మ వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. టూరిజం గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టతను వివరించారు.

వండర్‌ఫుల్ రామప్ప టెంపుల్..

వండర్‌ఫుల్ రామప్ప టెంపుల్ అని అమెరికాకు చెందిన ఎమిలి కొనియాడారు. శనివారం ఆమె తన కుటుంబసభ్యులతో సందర్శించి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. టూరిజం గైడ్ ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకొని రామప్ప ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందని ఆనందం వ్యక్తంచేశారు.



రామప్పలో అమెరికాకు చెందిన ఎమిలి కుటుంబసభ్యులు

బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవాలి

ములుగు రూరల్: 317 జీఓ ప్రకారం బదిలీ అయిన ఉపాధ్యాయులు తిరిగి బదిలీ కోసం ఈనెల 12నుంచి 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పాణిని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు అన్ని వివరాలు ఇవ్వాలన్నారు. సంబంధిత డీడీఓలు బదిలీ దరఖాస్తులను ఉపాధ్యాయుడి ఒరిజినల్ సర్వీస్ రిజిస్టర్, సంబంధిత సర్టిఫికెట్ ఆధారంగా వెరిఫై చేసి వివరాలు ఇవ్వాలని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారులు తనిఖీచేసి డీఈఓ కార్యాలయం పంపించాలన్నారు. డీడీఓ సంతకం లేని బదిలీ దరఖాస్తులను స్వీకరించబోమని పేర్కొన్నారు.

ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో సినిమా షూటింగ్



అడవితల్లి గుండెల్లో 'తుపాలకుగూడెం'

ఏటూరునాగారం: 2009లో ఝార్ఖండ్‌లో జరిగిన యదార్థ ఘటనను కళ్లకు కట్టినట్లు చూపించి ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందిన చిత్రం రెబల్స్ ఆఫ్ తుపాకులగూడెం. ఏటూరు నాగారం మండలకేంద్రానికి చెందిన నూతి జైదీప్ విష్ణు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శనివారం మండలకేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర థియేటర్‌కు వచ్చిన చిత్ర దర్శకుడు విష్ణు, హీరో శ్రీకాంత్, తదితర నటులు గ్రామస్తులు, గ్రామ పెద్దలతో కలిసి చిత్రాన్ని తిలకించారు. ప్రపంచ వ్యాప్తంగా 120 సినిమా థియేటర్లలో ఫిబ్రవరి 3న రెబల్స్ ఆఫ్ తుపాకులగూడెం సినిమా విడుదల అయింది. ఏటూరు నాగారం, కన్నాయిగూడెం, తదితర మండలాల్లో ఈ చిత్రాన్ని చిత్రీకరించారు. ఆధునిక సమాజంలో తమ స్వార్థం కోసం అమాయకులను వంచనకు గురి చేసే ఎందరో మోసగాళ్లుంటారని యువతకు సినిమా ద్వారా చెప్పారు. ఇందులో ప్రధానంగా గిరిజన గ్రామాలు, అడవీ ప్రాంతాలను చూపిస్తూ సినిమా రంగానికి సుమారు 40మంది నటీనటులను పరిచయం చేశారు. స్థానికులు సుమారు వంద మంది యువకులు తదితర సన్నివేశాల్లో నటించారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కండెల ప్రవీణ్, శ్రీకాంత్, జయశ్రీ ప్రధాన పాత్రల్లో నటించారు. వరంగల్‌కు చెందిన సంతోష్ ముర్కార్ కథ, మాటల రచయితగా ప్రేక్షకులను మెప్పించారు. దర్శకుడు స్థానిక నటులు వారి అనుభవాలను సాక్షికి వివరించారు.



ఏటూరునాగారం సినిమా థియేటర్‌కు వచ్చిన చిత్ర యూనిట్ సభ్యులు

ఆదరించారు..



పల్లెల్లో ఈ సినిమాను తీయడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఆదరించారు. సినిమా ప్రజల మనుస్సును దోచుకుంది. పల్లె ప్రాంతంలో జరుగుతున్న అన్యాయాలను సినిమాలో చూపించడంతో యువత చాలా వరకు ఆసక్తి చూపారు. చాలా ఆనందంగా ఉంది.

- శివరాంరెడ్డి, నటుడు

రెస్పాన్స్ బాగుంది..



చిత్రాన్ని ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ వరకు తీసుకెళ్తామనే భరోసా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 120 సెంటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేశాం. అన్ని చోట్లా ఆదరణ బాగుంది. సినిమాను కొత్త కోణంలో చూపించడంతో యువతను ఆకట్టుకుంది.

- శ్రీకాంత్, సినీ హీరో

నమ్మి మోసపోవద్దు..



ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు మన చుట్టుపక్కలే ఉంటూ నమ్మకంగా నటిస్తూ ఉద్యోగం పేరుతో యువతను మోసంచేసే వారు అనేక మంది ఉంటున్నారనేది చిత్రంలో చూపించాం. మనకు ఉన్న జ్ఞానం ఎదగాలని, ఎవరినీ నమ్మవద్దని, ఉన్న ఊరు, కన్న తల్లిదండ్రులను విడిచి పోకుండా బతకడమే చిత్రం తెలుస్తోంది.

- నూతి జైదీప్ విష్ణు, డైరెక్టర్

లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న లలిత శివజ్యోతి

ములుగు రూరల్: జాతీయ లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తోందని, రాజీమార్గమే రాజా మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పీవీపీ లలిత శివజ్యోతి అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత శివజ్యోతి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కక్షిదారులు కేసులను రాజీ కుదుర్చుకొని ప్రశాంతమైన జీవనాన్ని గడపాలన్నారు. లోక్ అదాలత్ తమ కేసులను రాజీ చేసుకుంటే అప్పీల్ ఉండదని ఇదే అంతిమ తీర్పు అన్నారు. లోక్ అదాలత్‌లో మూడు బెంచీలను ఏర్పాటుచేసి పెండింగ్‌లో ఉన్న 119కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టి.మాధవి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి డి.రామమోహన్‌రెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బాలుగు చంద్రయ్య, న్యాయవాదులు వై.నర్సిరెడ్డి, ఎం.వెంకటేశ్వర రావు, సీహెచ్.వేణుగోపాలచారి, ఆర్.భిక్షపతి, మేకల మహేందర్, కె.సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌బీఐ ములుగు బ్రాంచి ఆధ్వర్యంలో కక్షిదారులకు 300 పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఖాళీ దొరికిందంటే కూలీగా..



కాస్త సెలవు దొరికితే చాలు వ్యవసాయ కూలీగా మారుతారు ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్. రెండో శనివారం సెలవు కావడంతో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా ఎప్పటిలాగే చేను బాట పట్టారు. ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధి చిన్న గుంటూరుపల్లికి చెందిన బానోత్ సమ్మయ్య–జ్యోతి దంపతుల మిరప తోటకు వెళ్లి కూలీలతో కలిసి మిరపకాయలు కోశారు. మధ్యాహ్నం కూలీలతో కలిసి అన్నం తిన్నారు. రోజంతా పని చేసినందుకు గాను వచ్చిన డబ్బులు రూ.250తో మరికొన్ని కలిపి మరొకరికి అందించారు.

- ములుగు రూరల్

విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్‌నగర్ మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులు రెండు గ్రూపులుగా విడిపోయి గొడవలు పెట్టుకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి ఆరోపించారు. శనివారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో సిలబస్ పూర్తి చేయకుండా ఉపాధ్యాయులు గ్రూపు పోరుతో ఒకరిపై ఒకరు డీఈఓకు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మోడల్‌స్కూల్‌లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ల ఆధ్వర్యంలో పాఠశాల నిర్వహణ కొనసాగడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే పాఠశాలకు పర్మినెంట్ ప్రిన్సిపాల్‌ను నియమించి పాఠశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎస్‌యుఐ నాయకులు గొర్రె రాహుల్, రెడ్డి శ్రీధర్, అభిరామ్, చరణ్, రాజువర్ధన్ ఉన్నారు.

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి..

ఉపాధ్యాయులే క్రమశిక్షణ లేకుండా పాఠశాలను భ్రష్టుపట్టిస్తున్నారని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా అధ్యక్షుడు పంబిడి శ్రీధర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోడల్‌స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని చెప్పారు. ప్రిన్సిపాల్‌పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

కోర్టును ఆశ్రయిస్తా..

మోడల్‌స్కూల్‌లో ఆరేళ్లుగా పనిచేస్తున్న తనను ప్రిన్సిపాల్ కరుణాకర్, ఉపాధ్యాయుడు ఆయాజ్‌ఖాన్ నిత్యం వ్యక్తిగత దూషణలకు దిగుతూ అవమానపరుస్తున్నారని మోడల్‌స్కూల్ ఆపరేటర్ ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయించనున్నట్లు ప్రవీణ్ తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా రామమ్ చిట్‌ఫండ్స్ వేడుకలు



అన్నదానం చేస్తున్న చైర్మన్ సుధాకర్

కాజీపేట: హనుమకొండ రామమ్ చిట్ ఫండ్స్ 15వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బాల సముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం మానసిక దివ్యాంగుల కేంద్రంలో సంస్థ చైర్మన్ బన్న సుధాకర్ అన్న దానం చేశారు. కార్యక్రమంలో ఎండీ శ్రీరామోజు గిరిబాబు, సిబ్బంది సునీల్, రాజ్‌కుమార్, యాదగిరి, శ్రీధర్, రాజశేఖర్, రవికుమార్ శ్రీనివాస్, సందీప్‌కుమార్, దీపక్, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేపాల్ ఆర్మీ డే రన్‌లో ప్రవీణ్‌నాయక్ ఫస్ట్



నేపాల్‌లో గోల్డ్‌మెడల్‌తో ప్రవీణ్‌నాయక్

సంగెం: వరంగల్ జిల్లా సంగెం మండలంలోని పల్లారుగూడ పోచమ్మ తండాకు చెందిన కానిస్టేబుల్ డాక్టర్ బానోత్ ప్రవీణ్‌నాయక్ ప్రపంచస్థాయి పరుగు పందెంలో భారతదేశం నుంచి మొదటి స్థానం సాధించాడు. శనివారం నేపాల్‌లో 260వ నేపాల్ ఆర్మీ దినోత్సవం సందర్భంగా కాయస్ ఓపెన్ మారథాన్, రన్ ఫర్ ఫన్-2023 ఆధ్వర్యంలో నిర్వహించిన 10 కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రపంచంలోని వివిధ దేశాల పోలీస్‌యంత్రాంగం నుంచి పలువురు పాల్గొన్నారు. ఢిల్లీలోని పీఎంఓలో సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌నాయక్ పాల్గొని మొదటి స్థానంలో నిలిచి విజేతగా గోల్డ్‌మెడల్, రూ.10వేల పారితోషకం, ప్రశంసా పత్రం సాధించారు. మారుమూల తండాలో పుట్టి పెరిగిన ప్రవీణ్‌నాయక్ విజయం సాధించి భారతదేశం గర్వించదగిన స్థాయికి ఎదగడంతో పలువురు ప్రముఖులు, గ్రామస్తులు అభినందించారు.

అనుమానాస్పద వ్యక్తులకు దేహశుద్ధి

- పలు చోట్ల చోరీలపై ఆరా
- సీసీఎస్ పోలీసులకు అప్పగింత



తండావాసులు పట్టుకున్న అనుమానిత వ్యక్తులు



అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఖానాపురం: అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలం చిలుకమ్మతండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకమ్మతండా శివారులో డంపింగ్ యార్డు వద్ద ఉప్పల్‌కు చెందిన షాహిల్‌షేక్, ఖిలా వరంగల్ యాదవనగర్ కాలనీకి చెందిన సంగ ప్రణయ్‌లు తెల్లవారు జామున దుప్పట్లు సర్దుకుని వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. అదేసమయంలో తండాకు చెందిన ధరావత్ గణేష్ వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తున్నాడు. డంపింగ్ యార్డు వద్ద ఇరువురు వ్యక్తులు తారస పడ్డారు. అయితే పది రోజుల క్రితం మిర్చి, పత్తి బస్తాలు అపహరణకు గురికావడంతో అనుమానం వచ్చిన గణేష్ ఇరువురి వివరాలు సేకరించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో వారు పొంతనలేదని సమాధానాలు చేప్పడంతో గణేష్ సర్పంచ్ వెంకన్న, ఉపసర్పంచ్ ఈర్యలకు సమాచారం అందించాడు. అనుమానాస్పద వ్యక్తులు తీసుకొచ్చిన ద్విచక్ర వాహనం నంబర్‌ను పోలీసులకు పంపి విషయం వివరించారు. ఎస్సై తిరుపతి వాహనం వివరాలు సేకరించి యజమానికి ఫోన్ చేశాడు. దీంతో సదరు యజమాని తమ వాహనం హనుమకొండ చౌరస్తాలో ఇటీవల చోరీకి గురైందని వివరించారు. ఇదంతా జరుగుతున్న క్రమంలో ఇరువురు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేయగా స్థానికులు పట్టుకునే దేహశుద్ధి చేశారు. వారి వద్ద సంచి ఉండగా దానిని పరిశీలించగా అందులో సుత్తి, ఇనుప రాడ్లు, కత్తెర, పెట్రోల్ బాటిల్, చిల్లర డబ్బులు, దేవాలయాల్లో ఉండే విగ్రహాలు, వెండి వస్తువులతో పాటు గంజాయిని లభించినట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని ఖానాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారు తీసుకొచ్చిన వాహన నంబర్ ఆధారంగా వారు దొంగలుగా అనుమానించి పోలీసులు తండావాసులను అప్రమత్తం చేశారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. విచారణలో భాగంగా ఇరువురు వ్యక్తులను సీసీఎస్ పోలీసులకు స్థానిక పోలీసులు అప్పగించినట్లు సమాచారం.

పలు దొంగతనాలపై అనుమానం...

అనుమానాస్పదంగా పట్టుకున్న వ్యక్తుల వద్ద లభించిన వస్తువుల ఆధారంగా జిల్లాలో పలు ప్రాంతాల్లో జరిగిన చోరీలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఖానాపురం మండలం బుధరావుపేటలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో హుండీలో నుంచి నగదును అపహరించుకుపోయారు. దీంతో పాటు జిల్లాలో పలుచోట్ల జరిగిన దొంగతనాలు జరిగాయి. దీంతో పట్టుబడిన వ్యక్తులే చోరీలు చేశారా అనే నేపథ్యంలో విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

అదుపుతప్పి ఆటో బోల్తా..



బోల్తాపడిన ఆటో





క్షతగాత్రులు వినోద, రంగమ్మ

- ఎనిమిది మందికి గాయాలు
- శుభకార్యానికి వెళ్తొస్తుండగా ఘటన

కేసముద్రం: ఓ శుభకార్యానికి వెళ్లి వస్తున్న క్రమంలో, ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఇనుగుర్తి మండలం లాలుతండా జీపీ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతగిరి మండలం రావూరి గ్రామంలో జరిగే ఎంగేజ్‌మెంట్ కార్యక్రమానికి, నెల్లికుదురు మండలం జామాతండా జీపీకి చెందిన 13 మంది తండావాసులు ఆటోలో వెళ్లారు. కార్యక్రమాన్ని ముగించుకుని, తిరిగి ఆటోలో ఇంటికి వస్తున్నక్రమంలో లాలుతండాజీపీ సమీపంలోని మూలమలుపు వద్ద ఒక్కసారిగా ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న జామా తండావాసులు, సమీప బంధువులైన గుగులోతు తావుర్యా, రంగమ్మ, వినోద, గుగులోతు రమేష్‌లకు తీవ్రగాయాలు కాగా, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలైన వారిని నెల్లికుదురు మండలం చిన్న నాగారం గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఓ బాలుడి కాలుకు తీవ్రగాయాలు కాగా, అక్కడి నుంచి మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిన ఇల్లు



కాలిన డబ్బులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు

- మంటలకు పేలిన గ్యాస్ సిలిండర్
- ఐదుగురికి గాయాలు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె)మండల పరిధిలోని తానిపర్తి గ్రామంలో శనివారం విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తానిపర్తి గ్రామానికి చెందిన శ్యామల రమేష్ కుటుంబ సభ్యులు శనివారం ఉదయం తమ మిర్చి తోటలో పనులు చేసుకునేందుకు వెళ్లారు. కాగా, శనివారం సాయంత్రం 3 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటికి మంటలు అంటుకున్నాయి. దీంతో మంటలను అదుపు చేసేందుకు గ్రామస్తులు ప్రయత్నిస్తుండగా ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలింది. దీంతో మంటలను ఆర్పేందుకు యత్నించిన వారితోపాటు ఇంటిపక్కన వారు మేడి నాగమణి, బొల్లె అదయ్య, గుడ్డేటి రాజు, సుంకరి వెంకటేశ్వర్లు, మాదూరి ప్రసాద్‌కు గాయాలయ్యాయి. కాగా, మిర్చితోటలో కాయలు తెంపిన కూలీలకు ఇచ్చేందుకు వ్యాపారుల వద్ద రమేష్ తీసుకుకొచ్చిన రూ.2లక్షలతోపాటు 20 బస్తాల ధాన్యం, ఐదు తులాల బంగారం, భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు మంటల్లో కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన రమేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉద్యోగం పేరిట మోసం

భీమదేవరపల్లి: ఉద్యోగం వస్తుందని ఆశతో గుర్తు తెలియని వ్యక్తి మాటలు నమ్మి రూ.30వేలు అతని ఖాతాలో జమ చేసి మోసపోయినట్లు గుర్తించిన వ్యక్తి శనివారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని కొత్తకొండకు చెందిన బుర్ర నాగరాజు టెక్ మహేంద్ర కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వర్క్ ఫ్రమ్ హోం చేస్తున్నాడు. అతని సెల్ ఫోన్‌లో ఫేస్ బుక్ పేజీలో ఎస్ఏపీ ట్రెనింగ్ జాబ్స్ అంటూ చూసి వారు ఇచ్చిన ఫోన్ నంబర్‌కు ఈ నెల 7వ తేదీన ఫోన్ చేశాడు. దీంతో అవతలి వ్యక్తి తన పేరు శేఖర్ నాయుడు అంటూ తమ కంపనీలో ఉద్యోగాలు ఉన్నాయని వర్క్ ఫ్రం హోం ద్వారా ఉద్యోగం చేసుకోవచ్చని చెప్పాడు. ఇందుకు నెలకు రూ.70వేల జీతం ఉంటుందని తెలిపాడు. మొదటగా తమకు సర్వీస్ చార్జీలగానూ రూ.30వేలు చెల్లించాలని అనంతరం మీకు జాయినింగ్ ఆర్డర్ ఇస్తామని ఇందులో ఎలాంటి మోసం లేదని సదరు వ్యక్తి చెప్పిన మాటలను నమ్మిన నాగరాజు అతను చెప్పిన విధంగా అతను చెప్పిన బ్యాంక్ ఖాతాకు ఈ నెల 8వ తేదిన రూ.30వేలు పంపించాడు. డబ్బులు పంపించిన అనంతరం ఫోన్ చేయగా అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మోస పోయినట్లు గుర్తించి శనివారం ముల్కనూర్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ముల్కనూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపాడు.

దేవుడా నేనేం చేశాను..

- తొడలోకి గడ్డపార చొచ్చుకుపోవడంతో వ్యక్తి ఆర్థనాదాలు
- బైక్‌పై ప్రయాణిస్తుండగా.. కంకర రోడ్డుపై ప్రమాదం



గోపి కుడి తొడలో గుచ్చుకుపోయిన గడ్డపార

కాజీపేట అర్బన్: అభివృద్ధి పనులు చేసే సమయంలో సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు బాధ్యతగా వ్యవహరించి, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలి. కానీ, హనుమకొండ నగరం న్యూశాయంపేటలోని తెలంగాణ జంక్షన్ ప్రాంతంలో కొనసాగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనుల వద్ద అలాంటి హెచ్చరికలు ఏమీ లేకపోవడంతో ఓ వ్యక్తి తీవ్రగాయంతో ఆస్పత్రి పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. ములుగు జిల్లా జంగాలపల్లికి చెందిన ఆలకుంట గోపి బతుకు దెరువు నిమిత్తం హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. గోపి శనివారం హంటర్‌రోడ్డులోని తెలంగాణ జంక్షన్ మీదుగా హనుమకొండకు బైక్ పై వెళ్తున్నాడు. ఈక్రమంలో తెలంగాణ జంక్షన్ ప్రాంతంలో రోడ్డుపై వేసిన కంకరలో బైక్ స్కిడ్ అయి పడిపోయింది. దీంతో బైక్ ప్రమాదవశాత్తు కంకర్‌పై పడిపోవడంతో ప్రక్కనే ఉన్న గడ్డపార గోపి కుడి తొడలోకి చొచ్చుకుపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అశోక్‌రెడ్డి, రాజు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి గోపిని తరలించారు. ఆస్పత్రికి తరలించే క్రమంలో గోపి చేసిన ఆర్థనాదాలు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించాయి.

దక్షిణ మధ్య రైల్వే ప్రజలందరిది



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్: దక్షిణ మధ్య రైల్వే ప్రజలందరిదని, రైల్వే ఆస్తులను ఎవరూ ధ్వంసం చేయొద్దని దక్షిణ మధ్య రైల్వే కాజీపేట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై గుర్తు తెలియని యువకులు రాళ్లతో దాడి చేసిన ఘటనపై ఆయన వరంగల్ ఇన్‌స్పెక్టర్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారి టీఎస్ఆర్ కృష్ణతో కలిసి శనివారం ఘటన స్థలంలో విచారణ చేపట్టారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని మూసివేయబడిన కురవి రైల్వే గేటు నుంచి అనంతారం రైల్వే ఎల్‌సీ గేటు వరకు అధికారులు ట్రాక్ వెంబడి నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. ఘటన జరిగిన ప్రాంతంలో ఎవరు వందేభారత్ రైలుపై రాళ్లు విసిరారు.. అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎవరైన సరే రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట ఆర్‌పీఎఫ్ ఎస్సై నీలాంబ్రం, హెడ్ కానిస్టేబల్ నాగిరెడ్డి, రాజు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- కాజీపేట రైల్వేస్టేషన్‌కు 2 కి.మీ. లోపు సోమిడి విలేజ్ ఆనుకొని తాళ్ళ పద్మావతి కాలేజి రాకముందు ఉన్న శ్రీసాయిరాం డెవలపర్స్ వారి కుడా లేవుట్ నందు 150, 200, 250 గజాల ప్లాట్లు కలవు. 9110330716. [WA-3621]
- హన్మకొండ, గోపాల్‌పూర్ కల్లు మండువ దగ్గరలో విద్యాధరి స్కూల్ ప్రక్కన EAST ఫేసింగ్ 110 ఫీట్ల మేన్‌రోడ్డుకు సెకండ్ బిట్ గల 1000 చ॥గ॥ ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ 9849101554. [WA-2928]
- 150 Sq.Yards Plot, Jangaon, Nidigonda, Beside: HYD - WGL Highway, beside Jangaon Institute of Technology. Cont: 9573700725. [W-1170519]
- వరంగల్ ములుగురోడ్ నుంచి 1 కిలోమీటర్ దూరంలో అయ్యప్పస్వామి గుడి దగ్గరలో ఉన్న ఆకృతి Enclave లో 275 చ॥గ॥ లేఅవుట్ ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ 9849101554. [WA-2929]
- 160 Sq.Yds Plot for Sale @ Doctors Colony, Near Lotus School Near DM & HO Warangal. Contact: 9552521355. Ramesh Kumar. [HA-92130]
- హైదరాబాద్, ఇబ్రహీంపట్నం - జనహర్ష డ్రీమ్ సిటీ- 1 & 2 లోని ప్లాట్లు అమ్మబడును మరియు కొనబడును. సంప్ర: 9247266234, 8886972345. [H-793508]
- About 250 Sq.Yards to 500 Sq.Yards Residential Plot for Sale. Near NIT, Beside Bishop Beretta School, Fatimanagar. Contact Jayaraju: 9989635057 or Praveen: 8008422520. [HA-10057]

FLAT FOR SALE

- Flat for Sale at Tejomayi Residence Nandhi Hills Flat No. 506, East Face 1025 Sft. Contact: Cell: 9059715311, 9110330716. [WA-3621]
- భీమారం మేన్‌రోడ్ Reliance Trends షాపింగ్ మాల్ ప్రక్క సందులో మేన్‌రోడ్ నుండి 3 ని॥ దూరంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి నివాస్ నందు 2 BHK & 3BHK Flats అమ్మకానికి కలవు. Good Ventilation. Ready to occupy. సంప్ర॥ 9849101554. [WA-2919]

SERVICES

- అనారోగ్యంతో మంచంలో ఉన్న వృద్ధులకు / సామాన్య వృద్ధులకు అన్ని వసతులు & వైద్య సౌకర్యంతో గదులు కలవు. సాయిసేవా ట్రస్ట్, వడ్డేపల్లి, హనుమకొండ. 9848444020, 9949189357. [W-775779]

LOANS

- సులభంగా లోన్ పొందండి. అతి తక్కువ వడ్డీతో, అన్ని రకాల లోన్స్, ఉద్యోగస్తులు, వ్యాపారులు, వైద్యులు (NRI) సంప్ర॥ JS ఎంటర్‌ప్రైజెస్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం. 8520970781, 7842830781. [M-1190523]

OLD AGE HOME

- స్టార్ ఓల్డ్ ఏజ్‌హోమ్/ హోంకేర్ సర్వీస్: 24గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్నపిల్లలను చూసుకోవడానికి, ఇంటిపని, వంటపని చేయుటకు మీ ఇంటివద్దకే అనుభవం గల వర్కర్లని, స్త్రీ/పురుషులను పంపించగలము. 8897730132, 8186926067. [W-1170521]

CHANGE OF NAME

- I, The undersigned LAKKARSU RAJYA LAKSHMI, W/o: Lakkarsu Bikshapathi, (Old Name), R/o. H.No.2-8-551, Indira Nagar Colony, Hanamkonda, Warangal - 506001, T.S., India. I have changed my name as LAKKARSU RAJYALAXMI, W/o. Lakkarsu Bikshapathi (New Name) for all future purposes. [W-775826]

BUSINESS OFFER

- Invest in Trading with Small Amount and get Daily Returns, 100% Security. Contact: Ph: 8317689472. [H-787438]
- పర్మినెంట్ బిజినెస్ పార్ట్‌టైమ్ పెట్టుబడిలోనే లైఫ్ టైమ్ మాస్టర్ ఫ్రాంచైజీ లీడింగ్ మల్టీ బిజినెస్ డైలీ సపోర్టు+ట్రైనింగ్+మంచి భవిష్యత్తు + ఆదాయం +15 సం॥ అనుభవం. ఫోన్: 9908743603 [HA-5600]

WANTED

- Wanted Field Executives. Q: Any Degree. On 13-02-2023 (10 AM to 5PM) Cont: Suvidyaa Junior College for Girls, Opp. to Water Tank, Nakkalagutta, HNK. 8885599244. [W-1110304]
- Wanted F/M Marketing Agents for Leading a Banking Channel. Earn Every Month 50K above. Immediately Cont: 9963490087. [WA-5272]
- వరంగల్ స్టేషన్‌రోడ్‌కు గల విష్ణు లాడ్జిలో పని చేయుటకు మేనేజర్స్‌గా, సూపర్‌వైజర్స్‌గా 12 గం॥ డ్యూటీ సాలరీ: 10 వేలు ఇవ్వబడును. రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు, RTC కండక్టర్స్, మొ॥వారికి ప్రాధాన్యత. 9391864657 [W-775819]
- స్టార్ హోంకేర్ సర్వీస్ 24గం॥ పేషంట్లు, పెద్ద వారిని ఇంటివద్దనే చూసుకోవడానికి ఆడ/మగవారు కావలెను. ఉచిత భోజన సదుపాయం కలదు. 24 గం॥ డ్యూటీ. సెల్: 8977263124, 8897730132. [W-1170520]
- వరంగల్‌లోని కిరాణం షాప్ నందు పని చేయుటకు 3సం॥ అనుభవం కల్గిన స్త్రీ/పు॥ కావలెను. వరంగల్ లోకల్ వారికి ప్రాధాన్యత. యువరాజ్ కిరాణం, వరంగల్. సంప్ర: 9490133696. [W-775824]
- Wanted Agents: HNK లో నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ నందు Flats అమ్మడానికి ఏజెంట్స్ కావలెను. మంచి కమీషన్ ఇవ్వబడును. Cont: 9849101554. [WA-2918]
- Marketing Sales Executives (M) Sal: 12000+ TA+Inc. Q: Any Deg. Office Executives (F) Sal: 6000-8000+Inc. Q: Any Deg. Varmas Business Services, WGL. 8074214446, 8703550619. [W-775804]
- శ్రీకృష్ణ హోం కేర్ (Govt. Reg.) Hyd లో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి (స్త్రీ/పు) కావలెను (ఏజెంట్లకు మంచి కమీషన్) జీ: 15,000- 25000/- రూం+భో॥ ఫ్రీ. ఫోన్: 9000448989. [H-793509]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779895]
- విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్స్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5. జీతం: 18 - 25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]
- హవిలాహ్ అసోసియేట్స్ నందు వర్క్ చేయుటకు టెలీకాలర్స్ కావలెను. Good Looking Female మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ బాయ్స్ కావలెను. 100 ft. దర్గా రోడ్, NIT దగ్గర. సెల్: 70932 85999. [M-8671]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190572]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

చెన్నారావుపేట: ఐదేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ ఐదేళ్ల చిన్నారిని శనివారం పాఠశాలకు సెలవు కావడంతో తన తల్లి వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లింది. ఇదే గ్రామానికి చెందిన రఘుపతి అనే యువకుడు వ్యవసాయ బావి వద్ద చిన్నారిని జామకాయలు ఇస్తానని చెప్పి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. దీంతో భయపడిన చిన్నారి ఆ యువకుడిని తప్పించుకొని ఏడ్చుకుంటూ తల్లి వద్దకు వచ్చి జరిగిన విషయం చెప్పింది. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

లారీ ఢీకొని కూలీ మృతి

- మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా



రమేశ్(ఫైల్)

మల్హర్: మట్టి లోడుతో వస్తున్న లారీని ఢీకొని కూలీ మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల హనుమాన్ సెంటర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిచర్లకు చెందిన బానాల రమేశ్(50) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో శనివారం పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో తాడిచర్ల శివారులోని ఆర్అండ్ఆర్ అభివృద్ధి పనుల నిమిత్తం మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ రమేశ్‌ను ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రమేశ్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. కొయ్యూరు ఎస్సై నరేష్, కాటారం ఎస్సైలు శ్రీనివాస్, సుధాకర్‌లు అక్కడకు చేరుకొని వారిని శాంతింపజేశారు. మృతుడి భార్య దేవక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జ్వరంతో యువకుడు..



ఆవుల రాజు(ఫైల్)

గూడూరు: జ్వరంతో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మానుకోట జిల్లా గూడూరు మండలంలోని చిన్న ఎల్లాపురంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల పైడి కుమారుడు కోల రాజు (19) నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడుతుండగా తండ్రి నర్సంపేట ఆస్పత్రిలో చికిత్స అందించాడు. రక్త కణాలు తగ్గుతున్నాయని అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించాడు. ఈక్రమంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు రాజు మృతి చెందాడు.

గొప్ప దర్శకుడు.. కే. విశ్వనాథ్



విశ్వనాథ్, వాణీజయరాం చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నిర్వాహకులు, కళాకారులు

హన్మకొండ కల్చరల్ : మన సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటిన గొప్ప దర్శకుడు విశ్వనాథ్ అని, ఆయన సినిమాల్లో పాడిన వాణీజయరాం గొప్ప గాయని అని ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఉదయం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మాస్టర్‌జీ కాలేజీలో అన్నమయ్య సాహితి కళావికాస పరిషత్ అధ్వర్యంలో కళాతపస్వీ పద్మశ్రీ కె.విశ్వనాథ్, గాయని వాణీజయరాం సంస్మరణ సభ నిర్వహించారు. బయోఫార్మా అండ్ మాగ్నసేల్స్ కార్పొరేషన్ అధినేత ఉపేందర్ మహేశ్వరం సౌజన్యంతో ప్రముఖ సంగీత గురువు ఉమ్మడి లక్ష్మణాచారి అధ్యక్షత వహించిన స్మృతి – శృతి సంస్మరణ సభలో పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, ప్రొఫెసర్ తిరుపతయ్య, వూదాంతం జగన్నాథాచార్య, పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు సూత్రపు అభిషేక్‌లు విశ్వనాథ్, వాణిజయరాం చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చలనచిత్రాల్లో వాణీజయరాం పాడిన పాటల సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్‌జీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రోలరామ్, రవీంద్రనాథ్, మిమిక్రీ కళాకారులు అంజన్‌కుమార్, కళాభిమానులు పాల్గొన్నారు. సంగీత కళాకారులు రమేష్, మాధవి, వై. భీంశంకర్, కనకమహాలక్ష్మీ, పుల్లఖండం నీరజ, శీరీష, సుధాకర్, అశోక్, భవానీ విజయ్‌కుమార్ తదితరులు తమ గాత్రంతో అలరించారు.

ఆపదలో ఉన్నవారికి రక్తం అందిస్తాం

- యూ బ్లడ్ యాప్ సృష్టికర్త డాక్టర్ యలమంచి జయ్



యలమంచి జయ్‌తో మాట్లాడుతున్న తిరుమల్‌రావు

హసన్‌పర్తి: ఆపదలోఉన్న వారికి రక్తం అందిస్తామని యూ బ్లడ్ యాప్ సృష్టికర్త, ఎన్ఆర్ఐ డాక్టర్ యలమంచి జయ్ అన్నారు. హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ యలమంచి జయ్ నగరానికివచ్చిన సందర్భంగా శనివారం ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూ బ్లడ్ యాప్‌లో రక్తదాతలతోపాటు రక్త గ్రహీతల సమగ్ర సమాచారాన్ని పూర్తిగా పొందుపరుస్తున్నట్లు తెలిపారు. రక్తం అవసరం ఉన్నవారు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు పంపిస్తే రక్తం లభిస్తోందన్నారు. యూ బ్లడ్ యాప్ ద్వారా అందిస్తున్న సేవలను గురించి వివరించారు.

కోడలిపై మామ దాడి

- భూవివాదమే కారణం
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన



దాడిలో గాయపడిన లావణ్య

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణ పురం మండలంలోని ధర్మారావుపేటలో ఆస్తి పంపకాల విషయంలో తలెత్తిన గొడవలో కేశెట్టి మల్లయ్య తన కోడలు లావణ్యపై శనివారం దాడి చేశాడు. బాధితురాలు లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కుమారుడు గిరిబాబుతో లావణ్యకు వివాహం కాగా, నాలుగేళ్ల క్రితం గిరిబాబు మృతి చెందాడు. కొద్ది కాలం తర్వాత ఆస్థిపంపకాలు చేసుకున్నారు. కోడలు లావణ్య వాటాకు వచ్చిన ఎకరం పొలాన్ని దక్కించుకునేందుకు మామ మల్లయ్య తరచూ ఆమెను బెదిరిస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. శనివారం పొలంలో మామ మల్లయ్య నాటు వేస్తున్నాడని తెలిసి అడ్డుకునేందుకు లావణ్య అక్కడకు వెళ్లింది. దీంతో కోపంతో మామ మల్లయ్య కోడలుపై పారతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. లావణ్య తలకు బలమైన గాయాలు కావడంతో 108లో ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు.

స్టోరీ టెల్లింగ్, స్పెల్‌విజార్డ్ పోటీలు

- 13న నిట్‌లో నిర్వహణ

విద్యారణ్యపురి: పాఠశాల విద్యాశాఖ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా), తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రెనింగ్ (టీఎస్ఎస్‌సీఈఆర్‌టీ), భారతి ఫౌండేషన్ సంయుక్తంగా రాష్ట్ర స్థాయి స్టోరీ టెలింగ్, స్పెల్‌విజార్డ్ పోటీలను వరంగల్ నిట్‌లో ఈనెల 13న నిర్వహించనున్నారు. 33 జిల్లాల్లో ప్రతి జిల్లానుంచి నలుగురు చొప్పున విద్యార్థులు, వారి గైడ్ టీచర్లు, పలువురు తల్లిదండ్రులు పాల్గొనబోతున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టిన విషయం విధితమే. అయితే తెలుగు మీడియం విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో బోధనకు సిద్ధం కావాల్సింటుంది. కానీ, విద్యార్థుల్లో ఇంగ్లిష్‌పై ఉన్న భయాన్ని భయాన్ని తొలగించేందుకు వివిధ పాఠశాలల్లో పోటీలను నిర్వహించారు. అనంతరం అందులో ప్రతిభ చూపినవారికి గత నెల 31న జిల్లాస్థాయి పోటీలను నిట్‌లో నిర్వహించారు. ప్రతిజిల్లాలో ఇలాగే నిర్వహించి ప్రతిభ చూపినవారిని ఎంపిక చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్రస్థాయి, ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీల కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ శనివారం తెలిపారు. ప్రారంభ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ నిట్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్ధన్‌రావు, ప్రొఫెసర్ మాధవిరెడ్డి, హనుమకొండ జిల్లా డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, వరంగల్ డీఈఓ వాసంతి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఎల్టా వ్యవస్థాపక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టీవీరావు, రాష్ట్ర అధ్యక్షుడు వినయధర్‌రాజు పాల్గొననున్నారు. పోటీల్లో ప్రతిభ చూపినవారిని ఆరుగురిని ఎంపిక చేస్తారు. స్టోరీ టెల్లింగ్లో స్పెల్‌విజార్డ్‌లో ముగ్గురు చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తారు. ప్రథమస్థానం సాధించిన వారికి రూ.5వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.3వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.2వేల చొప్పున నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.